క్లుప్తంగా

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన సన్నె



బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సన్నె ఉదయ్‌ప్రతాప్, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ సన్నె ఉదయ్‌ప్రతాప్ ఆదివారం కరీంనగర్‌లో మర్యాద పూర్వకంగా బొక్కె ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జిల్లా నాయకులు వీరభద్రం, మేకల నాగేంద ర్, బండారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపేంద్రరావు

ఖమ్మం సహకారనగర్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పూర్వ వీఆర్‌వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్ర రావు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఖమ్మంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రరావు మాట్లాడుతూ... పూర్వ వీఆర్వోలను రిడెప్లాయిమెంట్, లాటరీ విధానంలో బదిలీలు చేయటంతో తలెత్తిన పలు సమస్యలను పరిష్కరించేలా చూడాలని, కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ వీఆర్వోలు బంకా కృష్ణ, చర్ల శ్రీనివాసరావు, జానిమియా, వెంకన్న, లవన్‌కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సదస్సులో ఖమ్మం వాసి



సైదులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: తమిళనాడు రాష్ట్రంలోని నమ్మికల్ రోడ్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ పన్నుల సదస్సులో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్ల సదరన్ జోన్ జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న ఖమ్మం వాసి వుల్లిబోయిన సైదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రం నిర్ణయించిన ప్రత్యక్ష, పరోక్ష పన్నులు, 53వ వస్తు సేవా పన్ను కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలపై సందేహాలను సదస్సు దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ నుంచి మరికొందరు కూడా పాల్గొనగా వారిని సదస్సు నిర్వాహకులు సన్మానించారు.

ఆలయంలో చోరీ

కామేపల్లి: మండలంలోని బండిపాడు గ్రామ శివారులోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం చోరీ చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగలకొట్టి నగదు ఎత్తుకెళ్లారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	కల్కి
సాయిరాం	కల్కి
ఆదిత్య	కల్కి, మహారాజ
శ్రీనివాస	కల్కి

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	60	బచ్చలికూర	4 / 20
వంకాయ	26	పాలకూర	3 / 20
బెండకాయ	20	చుక్కకూర	3 / 20
పచ్చిమిర్చి	48	తోటకూర	4 / 20
కాకర	64	గోంగూర	4 / 20
బీర	38	మెంతికూర	3 / 20
దొండ	16	కొత్తిమీర	1 / 50
పొట్లకాయ	60	పుదీన	1 / 30
చిక్కుడు	78		
గోరుచిక్కుడు	68		
క్యాబేజీ	40		
క్యాలీఫ్లవర్	30		
ఆలుగడ్డ	36		
చామగడ్డ	40		
క్యారెట్	56		
క్యాప్సికం	70		

-ఖమ్మం వ్యవసాయం

గూడేల్లో దారిద్ర్యం..!

అధ్వానంగా కొత్తగూడెం అంతర్గత రహదారులు

- డ్రెయిన్లు లేక మురుగునీరు రోడ్డుపైకి
- చెరుకూరి తోట రోడ్డు సైతం ధ్వంసం
- కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతున్న వైనం
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, స్థానికులు
- ఎన్నికలప్పుడే గుర్తుకొస్తున్నామని మండిపడుతున్న స్థానికులు



అధ్వానంగా మారిన గొల్లగూడెం- కొత్తగూడెం లింక్ రోడ్డు



మురుగుమయంగా మారిన రోడ్డు

నగరం నడిబొడ్డున ఉన్న వీలిన గ్రామాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లు వేయకపోవడంతో గుంతలు పడి చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. అంతేకాక డ్రెయిన్లు లేక మురుగునీరంతా రోడ్డుపైకి వచ్చి చేరుతుండడంతో నర(డ)కయాతన అనుభవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. గుంతల్లో నీరు నిలవడంతో రాకపోకలు సాగించే సమయాన పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఎన్నికలప్పుడే రాజకీయ నాయకులకు తమ సమస్యలు గుర్తుకొస్తున్నాయంటూ ప్రజలు మండిపడుతున్నారు.

ఖమ్మంఅర్బన్: నగర శివారులోని గొల్లగూడెం రోడ్డు నుంచి చెరుకూరి మామిడితోట రోడ్డు అంటే తెలియని వారే ఉండరు. ప్రతీ కార్తీక మాసంతో పాటు ఇతర రోజుల్లో సైతం గ్రూపు సభ్యులు సరదాగా గడపాలనుకుంటే ఆ తోట గుర్తుకొస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పలు వర్గాల ప్రజలకు సైతం ఈ రోడ్డుతో కొంత అనుభవం ముడివేసుకున్నారు. అలాంటి రోడ్డు నుంచి నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెం వెళ్లాల్సిన రోడ్డంతా గుంతలు పడి పగలు నడవడమే కష్టంగా ఉంటుంది. కొత్తగూడెంలో పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్డులో మోకాలు లోతు గుంతలు ఉండడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా అందులో పడి పలువురు గాయాల పాలవుతున్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే తాము గుర్తుకొస్తామని, ఆ రోడ్డు, ఈ రోడ్డు వేస్తాం, పారిశుద్ధ్య చర్యలు చేపడుతామని ప్రచారం సాగించి తర్వాత తమ బాధలు ఆలకించే వారే కరువయ్యారని కొత్తగూడెం వాసులు మండిపడుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..

కొత్తగూడెం, అల్లీపురం, చింతకాని మండలం కొదుమూరు, వందనం తదితర గ్రామాలకు రోటరీనగర్, గొల్లగూడెం, వైరా రోడ్డు నుంచి రాకపోకలు సాగించేందుకు ఇదే ప్రధాన లింక్ రోడ్డు. పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. నగరం నడిబొడ్డున ఉన్నా ఈ రోడ్డునే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, వర్షాలు అడపాదడపా పడితేనే దారుణంగా తయారవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇక ముసురు పెడితే రోడ్డులో ఎక్కడ గుంత ఉందనేది తెలియదని, దీంతో అనేకమంది ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని, గతంలో అనేక మంది వాహనదారులు పల్టీలు కూడా కొట్టి గాయపడిన ఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ బాధలను గుర్తించి రెండు డివిజన్లకు ప్రధాన లింక్ రోడ్డుగా ఉన్న కొత్తగూడెంలో అంతర్గత రహదార్లను బాగు చేసి తమ బాధలను తీర్చాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. డ్రెయిన్లు లేకపోవడంతో వాడకం నీరు రోడ్డుపైనే పారుతుండడంతో మరింత బురదమయంగా మారుతోంది.

విద్యార్థుల అవస్థలు..

కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాల ప్రధాన ద్వారానికి ఎదురుగా ఉన్న రోడ్డు గుంతలు పడడంతో చినుకు పడినప్పుడల్లా.. నీరు నిలిచి వరి మడులను తలపిస్తోంది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు, అధ్యాపకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా వీరి బాధలను గుర్తించి గుంతల రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

రోడ్లు దారుణంగా మారాయి..



పేరుకే నగరంలో ఉంటున్నాం. మా గ్రామంలోని కొన్నిరోడ్లు దారుణంగా మారాయి. ప్రధానంగా రోటరీనగర్ నుంచి కొత్తగూడెం వచ్చే మార్గంలో పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్డు గుంతలు పడడంతో వర్షం వచ్చినప్పుడల్లా చెరువులను తలపిస్తోంది. అధికారులు మా బాధలను గుర్తించి బాగు చేయాలి.

– ఎస్‌కె.సుల్తాన్, కొత్తగూడెం వాసి

గుంతలు, మురుగుతో సమస్య..



రోడ్డుపై గుంతలతో పాటు డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడంతో వాడకం నీరు కూడా రోడ్డుపైకి పారుతోంది. దీంతో గుంతల్లో ఆ మురుగు నీరంతా చేరి రాకపోకలు సాగించే సమయాన నరకంగా ఉంటుంది. ఇక రాత్రి అయితే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు దృష్టి సారించి సమస్యకు పరిష్కారం చూపాలి.

– వడ్డెపుడి మల్లేష్, కొత్తగూడెం నివాసి

నూతన ఆర్థిక విధానాలతో ధరలు పెరుగుదల



ఖమ్మంమయూరిసెంటర్: మాట్లాడుతున్న రమేష్



ఖమ్మంరూరల్: మాట్లాడుతున్న రవీందర్

ఖమ్మంమయూరిసెంటర్: నూతన ఆర్థిక విధానాలు ఫలితంగానే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అన్నారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో జరిగిన పార్టీ టూటౌన్ కమిటీ రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా నూతన ఆర్థిక విధానాలు–ప్రజలపై భారాలు అనే అంశంపై రమేష్ మట్లాడారు. ప్రపంచ బ్యాంక్ సంస్కరణలను మోదీ ప్రభుత్వం వేగంగా అమలు చేస్తుందని, ఈ నూతన సంస్కరణలు ఫలితంగా ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, పార్టీ టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్, నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదం ప్రమాదకరం

ఖమ్మంరూరల్: దేశ భవిష్యత్‌కు మతోన్మాదం అనేది చాలా ప్రమాదకరమని సీపీఎం విద్యా విభాగం సబ్ కమిటీ సభ్యులు బోడపట్ల రవీందర్ అన్నారు. మంచికంటి నగర్‌లో జరిగిన సీపీఎం రూరల్ మండల రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ... ప్రజల మధ్య విభేదాలు సృష్టించి అమాయక ప్రజలను పక్కదారి పట్టిస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంద్ర ప్రసాద్, సిద్దినేని కోటయ్య, వి. సుదర్శన్‌రెడ్డి, ఏ. వరప్రసాద్, ఎన్. క్రిష్ణ, సుమతి, మోహన్‌రావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి




మాట్లాడుతున్న కృష్ణమూర్తి

ఖమ్మం అర్బన్: పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశ పుల్లయ్య, కన్నెకంటి కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం నగరంలోని రోటరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసనకు పెన్షనర్లు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు. సత్యనారాయణ, శరత్‌బాబు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎండి అబ్దుల్ పాల్గొన్నారు.

దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడాలి

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో భూస్వాములు, పెట్టుబడుదారులు, సామ్రాజ్యవాదులు అందరు ఒకటై ప్రజల్ని దోపిడీకి గురి చేస్తున్నారని, ఈ దోపిడీ వర్గాలపై ప్రజలు వ్యతిరేకంగా పోరాడాలని రవన్న మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి ఏ.రామారావు అన్నారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టడీసర్కిల్‌లో రామారావు మాట్లాడుతూ... ప్రజలను, కార్మికులను, శాస్త్రీయ దృక్పథం వైపు చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యంగా కమ్యూనిస్టులపై ఉందన్నారు. ప్రజల్ని ఆలోచించనీయకుండా మతం అనే మత్తుని విస్తృతంగా వాడుకుంటున్నారన్నారు. స్టడీసర్కిల్ కన్వీనర్ రాయల రవికుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, డివిజన్ కార్యదర్శి ఝూన్సీ, నాయకులు సురేష్, వెంకటేష్, రవీందర్, లక్ష్మణ్, లక్ష్మి, సత్తార్, వెంకట్ కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన 'స్టాటిస్టిక్స్' దినోత్సవ వేడుకలు



విద్యార్థినులతో ప్రొఫెసర్లు, అధ్యాపకులు

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడక్రాస్‌రోడ్‌లో గల తెలంగాణా సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్టాటిస్టిక్స్ దినోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.ఝాన్సీరాణి మాట్లాడుతూ ... పోస్టర్ ప్రజంటేషన్, ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు, కాంట్రిబ్యూషన్ ఆఫ్ ద ఇండియన్ స్టాటిస్టిక్స్, ఆన్‌లైన్ వెబినర్ అనే అంశాలపై ప్రొఫెసర్ సి. సతీష్‌కుమార్ విద్యార్థినులకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డాక్టర్ జి.నిరూప, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రబాబు, కె. రాజు, ఐ.గీత తదితరులు పాల్గొన్నారు.

బైరవునిపల్లి వాసికి నంది అవార్డు



పురస్కారం అందుకుంటున్న కార్తికేయశర్మ

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన ఇందూరి కార్తికేయశర్మ వాస్తు జ్యోతిష్య, పురోహిత రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను తెలుగు వెలుగు మహానంది జాతీయ గౌరవ పురస్కారాన్ని ప్రతినిధులు అందించారు. కరీంనగర్‌లో ఆదివారం పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ చైర్మన్ రాజకుమార్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కార్తికేయ శర్మను గ్రామస్తులు సన్మానించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



షఫీని సన్మానిస్తున్న బాలసాహిత్య బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మోమినాన్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న షఫీ ఖమ్మం జిల్లా కథల పల్లకి పుస్తకానికి సంపాదకుడిగా వ్యవహరించినందుకు గాను సిద్దిపేట పెందోట బాలసాహిత్య పురస్కారం బాధ్యులు ఆదివారం సిద్దిపేటలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ... బాలసాహిత్యంలో తనకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలని మాల మహానాడు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, గుమ్మడి కనకరాజు మాట్లాడుతూ... సోమవారం జెడ్పీ మీటింగ్ హాల్‌లో నిర్వహించే జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై దాడి హేయం..



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో కొందరు భూమాఫీయాగా తయారై స్థలం తమదేనంటూ ఆ భూమిలో ప్రవేశించి అక్కడున్న మహిళలపై దాడి చేయటం హేయమైన చర్య అని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు అన్నారు. ఖమ్మంలో మహిళలపై దాడికి ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జెడ్పీసెంటర్‌లో నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలుసార్లు దాడులకు పాల్పడటం గమనిస్తుంటే తమంది అధికారుల అండదండలు ఉన్నట్లు కనిపిస్తుందని ఆరోపించారు. ఖమ్మం నగరంలో ఒక భూమాఫీయా కొత్తగా తయారై భూదందాలకు పాల్పడుతున్నట్లుగా ఈ ఉదంతం స్పష్టం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భద్రూనాయక్, విజయకుమార్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాధితురాలు సంధ్యారాణి, శ్రావణి, నెనీషా, నవజ్యోతి, వీరనారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు ఉపేంద్రబాయి, ఝాన్సీ, నాగేశ్వరరావు, రవీందర్ నాయక్, అనంతలక్ష్మి, ధనలక్ష్మి, స్వరూప, చంద్రకళ, జయ, జ్యోతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అలరించిన 'నా పాట పంచామృతం'



పాట పాడుతున్న గాయనీ, గాయకులు

ఖమ్మంగాంధీచౌక్: పద్మ విభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 'నా పాట పంచామృతం' పేరిట నిర్వహించిన బాలు స్మృతి గీతాంజలి ఆకట్టుకుంది. మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వాహకుడు మొగిలి గుణకర్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో తొలుత బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గాయకులు బాలు, అల్లి శంకర్, కీర్తన, కీర్తి, కావేరి రామారావు, క్రాంతి, లక్ష్మణ్ మోజి, శ్రీలత పుసులూరి, సత్యానంద తదితరులు ఆలపించిన పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సుధా మాధవరావు, అన్నం శ్రీనివాసరావు, కొత్తపల్లి శేషు, ముత్తమాల ప్రసాద్, జిల్లేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'చలో రాజ్‌భవన్'



మాట్లాడుతున్న వెంకటేష్

ఖమ్మంమయూరిసెంటర్: నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు(సోమవారం) చేపట్టిన ఛలో రాజ్‌భవన్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్ కోరారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నీట్ సమస్యపై అనేక సార్లు విద్యార్థి, యువజన సంఘాలు నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఈ నిరసనలో విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, పీవైఎల్ నగర ప్రధాన కార్యదర్శి రవీందర్, అశోక్, పృథ్వీ, ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్హానా సేవలు అభినందనీయం

ఖమ్మంరూరల్: 34 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ అంకిత భావతంతో పని చేసిన ఉపాధ్యాయురాలు మహ్మద్ ఫర్హానాబేగం సేవలు అభినందనీయమని జలగంగనర్ పాఠశాల హెచ్ఎం శ్యాంసన్ అన్నారు. ఈ మేరకు ఫర్హానా పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మహ్మద్ యూసుఫ్, వసీమ్, సలీం, తబుస్సుమ్, మెహినిష్, సికిందర్ పాల్గొన్నారు.

గాజాపై దాడులు నిరసిస్తూ ర్యాలీ

ఖమ్మం మామిళ్లగూడెం: గాజాపై ఇజ్రాయిల్ దాడులు స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పాలస్తీనాకు సంఘీభావంగా నగరంలో ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ మాట్లాడుతూ... గాజాపై దాడులు అత్యంత అనాగరికమైన చర్య అన్నారు. ఈ ర్యాలీలో ఫైసల్‌ఖాన్, తాజుద్దీన్, జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా, ఉపాధ్యక్షులు అబ్దుల్ సమీ, అబ్దుల్ మల్లిక్, అబ్రార్‌అలీ, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో జిల్లా కవులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ కళావేదిక సూర్యాపేట పట్టణలో ఆదివారం నిర్వహించిన 136వ జాతీయ కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవులు కవితలను వినిపించారు. జిల్లాకు చెందిన కవులు సత్యనారాయణ, సీత్లా నాయక్, శోభనాద్రి, వీరభద్రం, శ్రీనివాస్, నాగయ్య పాల్గొన్నారు.

'లయన్స్' కమిటీ బాధ్యతల స్వీకరణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం నూతన కమిటీ ఆదివారం బాధ్యతలను స్వీకరించింది. నగరంలోని గట్టయ్యసెంటర్ లయన్స్ క్లబ్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు నేతి రఘుపతి, మోతుకూరి మురళీధర్, డాక్టర్ రాఘవ రెడ్డి, డాక్టర్ డీపీసీ రావు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం జిల్లాలో అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహించి గుర్తింపును పొందిందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు 51వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. క్లబ్ ప్రతినిధులు సభ్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, వేములపల్లి వెంకటేశ్వరరావు, ఎస్ఎస్.రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య వర్ధంతి సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

తిరుమలాయపాలెం: ఈ నెల 4న ఖమ్మంలో జరిగే తెలంగాణ సాయుధ పోరాట అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని బచ్చోడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి రమేష్, వీరస్వామి, వల్లపు భిక్షం, ఉప్పయ్య పాల్గొన్నారు.

చీకటిలో కొత్త బస్టాండ్..



చీకటిగా ఉన్న బస్టాండ్ ఆవరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్ ఆవరణలో రాత్రివేళ వెలుగులకు బదులు చీకట్లు కమ్ముకుంటున్నాయి. బస్టాండ్‌లోని సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మధిర, మణుగూరు ప్లాట్ ఫామ్‌లకు ఎదురుగా బయట వైపు ఉన్న హైమాస్ట్ లైట్లు వారం రోజులుగా వెలగడం లేదు. రాత్రి 7 గంటల తర్వాత ఔట్‌గేటు నుండి లోపలకు వచ్చే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అలాగే ఈ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల సంఖ్య కూడా అదే స్థాయిలో ఉంటుంది. కానీ బస్టాండ్‌లో ప్రాంతమంతా చీకటిగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త బస్టాండ్‌లో ఎలక్ట్రీషియన్ లేకపోవడంతో నిర్వహణ లోపాలు ఎదురవుతున్నాయి.